
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 3 జూన్ 2024
5
తిరుపతి



'సీఎంఆర్' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఏర్పేడు మండలంలోని సీఎంఆర్ ఎకో అల్యూమినియం కర్మాగారంలో శనివారం జరిగిన ప్రమాదంలో 35మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురి కావడానికి పూర్తి బాధ్యత యాజమాన్యం వహించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓప్రకటనలో డిమాండ్ చేశారు. ముందస్తు రక్షణ చర్యలు లేకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి, 35 మంది కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మంటలు అధికంగా రావడానికి మోనో క్రోటోఫాన్ పురుగుల మందు డబ్బాలను నిప్పులో వేసి సమస్య పెరగడానికి కారకులయ్యారని ఆరోపించారని, కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌కు కందారపు మురళి విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజును కోరారు.

అదే అయోమయం.. ఉత్కంఠ..

- ఎగ్జిట్ పోల్స్ వెలువడినా ఇంకా రాని స్పష్టత
- పోటాపోటీగా ఎగ్జిట్ పోల్స్
- సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న కూటమి, వైసిపి శ్రేణులు



ప్రజాశక్తి- డక్కిలి

అసెంబ్లీ ఎన్నికలపై నిన్న వెలువడిన ఎగ్జిట్ పోల్స్‌పై ప్రజల్లో తీవ్రచర్చ జరుగుతోంది. పలానా సంస్థ ఎగ్జిట్ పోల్స్ వాస్తవానికి దగ్గరగా ఉండే అవకాశం ఉందా, లేదా ఏదైనా రాజకీయ పార్టీ ప్రభావితం చేసిన ఎగ్జిట్ పోల్స్ తెలియని అయోమయం ప్రజల్లో నెలకొంది. ఈ ఎగ్జిట్ పోల్స్‌లో అయితే వైసీపీ, లేదంటే ఎన్డీయే కూటమిలపై పలు సంస్థలు వైఖరి ఏకపక్షంగా కనిపించింది. దీంతో అసలు ఎగ్జిట్ పోల్ ఏదో, నకిలీ ఏదో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి.

వైసీపీ, ఎన్డీయే కూటమి మధ్య హోరాహోరీ పోరు సాగిందనే విషయం పోలింగ్ రోజే తేలిపోయింది. కానీ ఎగ్జిట్ పోల్స్ మాత్రం ఆ క్లారిటీ ఇవ్వడంలో విఫలమైనట్లు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ముఖ్యంగా ఎగ్జిట్ పోల్స్ సైతం ఒపీనియన్ పోల్స్ తరహాలో ఏదో ఒకవైపు మొగ్గు చూపాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత చరిత్ర చూసుకుంటే ఉమ్మడి ఏపీలో సైతం ఏ ఎన్నికల్లోనూ హంగ్ తరహాలో ఫలితాలు ఎప్పుడూ రాలేదు. ఎందుకంటే ఏపీ ప్రజల రాజకీయ వైఖరి ఎన్నికల్లో చాలా స్పష్టంగానే ఉంటుంది. ప్రతి ఎన్నికల్లో ఏదో ఒక పార్టీకి, లేదా కూటమికి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ఓటేయడం కనిపిస్తుంటుంది. కానీ ఈసారి ఎగ్జిట్ పోల్స్ గమనిస్తే కొన్ని సంస్థలు ఏకంగా 160 సీట్ల వరకూ ఒక్కో పార్టీకి లేదా కూటమికి కట్టబెట్టేశాయి. దీంతో ఎన్నికలు అంత ఏకపక్షంగా జరిగాయా అని ఓటేసిన వారే ఆశ్చర్యపోతున్నారు. జాతీయ మీడియా సంస్థలు వెలువరించిన ఎగ్జిట్ పోల్స్‌ను పరిశీలిస్తే లోక్‌సభ సీట్ల వరకూ కూటమికి మొగ్గుచూపాయి. కానీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల జోలికి మాత్రం పోకపోవడం ఇరు పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠను రేకెత్తిస్తుంది. గతంలో క్లిక్ అయిన పలు సంస్థల ఎగ్జిట్‌పోల్స్ సైతం అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్ ఇచ్చేందుకు ఆసక్తి చూపలేదు. దీనికి భిన్నంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కొత్త సంస్థలు లేదా వ్యక్తులు ఎగ్జిట్ పోల్స్ పేరుతో చేసిన హంగామా ఏదో ఒక రాజకీయ పార్టీకి లేదా కూటమికి అనుకూలంగా కనిపించింది. ఆయా సంస్థలు వెలువరించిన ఎగ్జిట్ పోల్స్‌ను తమకు అనుకూలంగా ఉన్న పార్టీలు సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నాయి. దీంతో అసలేదో, నకిలీది ఏదో తెలియక సామాన్యజనం తలపట్టుకుంటున్న పరిస్థితి. ఓటర్ నాడీ బహిర్గతమయ్యేందుకు మరికొన్ని గంటలపాటు వేచి చూడాల్సిందే.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

దర్శనానికి 24 గంటలు



ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. భక్తులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్‌లో ఉన్న వారికి ఉచితంగా మంచినీళ్లు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లను కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. బయట వరకూ క్యూలైన్ ఉంది. ఉచిత దర్శనం క్యూలైన్‌లో ఉదయం ఏడు గంటలకు టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం 24 గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. స్వామివారిని 67,873 మంది భక్తులు దర్శించుకోగా 33,532 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ కానుకలు రూ. 3.93 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఆదివారం తిరుమల శ్రీవారిని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దర్శించుకన్నారు. ఎగ్జిట్ పోల్స్ అన్నీ టీడీపీ అధికారంలోకి వస్తాయని, 53 శాతం ఓట్ షేరింగ్‌తో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలనే కసి ప్రజల్లో కనిపించిందని, పోస్టల్ ఓట్లు కూడా 90 శాతం ఏకపక్షంగా వేశారని, పోలింగ్ శాతం పెరగడం చూస్తే ప్రభుత్వ వ్యతిరేకత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు అని వ్యాఖ్యానించారు. ఎగ్జిట్ పోల్స్ అన్ని టీడీపీకి అనుకూలంగా వచ్చాయనిమాజీ మంత్రి నారాయణ అన్నారు. ఆదివారం నారాయణ వేంకటేశ్వర స్వామిని దర్శనానంతరం మీడియాతో మాట్లాడారు. భగవంతుడి దయతో టీడీపీ అత్యధిక మెజారిటీతో గెలుస్తుందన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి రోజా, నారాయణస్వామి

ఎగ్జిట్ పోల్స్ చెప్పిన జగన్ రెండోసారి సీఎం అవ్వడం ఖాయమని, ఏపీ ప్రజలు సంక్షేమానికి, అభివద్ధికి పట్టం కట్టారని, మహిళలు, వద్ధులు రాత్రి వరకు క్యూలో నిలబడి ఓటు వేశారని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను టీడీపీ అనుకూలంగా మార్చుకోవడాని ప్రయత్నిస్తోందని, చంద్రబాబు ఎన్ని దొంగాటలు ఆడినా జగన్‌ని ఏమీ చేయలేరని అన్నారు. అలాగే శ్రీవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ సీఎం జగన్ ను ప్రజలందరూ ఆశీర్వదించారని, వైసీపీ భారీ మెజారిటీతో గెలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కౌంటింగ్‌కి సర్వం సిద్ధం..!

4న సాయంత్రానికి అన్ని సెగ్మెంట్ల ఫలితాలు వెల్లడి

జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

కౌంటింగ్ సన్నద్ధతపై చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ అధికారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి తిరుపతి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ సంబంధిత అధికారులతో కలిసి హాజరై మాట్లాడారు. తిరుపతి జిల్లా ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేలా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని చర్యలు పూర్తిస్థాయిలో తీసుకుంటున్నామని తెలిపారు. సిఈఓ మాట్లాడుతూ కౌంటింగ్ హాల్‌లో ఎలాంటి గొడవలు జరగకుండా సత్వర చర్యలు డీఈఓలు, ఎస్పిలు తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్, ఈటిపిబిఎస్, పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపుకు, ఈవీఎంలలో ఫోల్డ్ అయిన ఓట్ల లెక్కింపుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాల నిర్వహించినట్లు తెలిపారు. అలాగే రౌండ్ల వారీగా ఫలితాల ట్యాబులేషన్, ఎన్కోర్‌లో ఫీడ్ చేయడం, అందుకు అవసరమైన ఐటీ సిస్టంల ఏర్పాటు, ఓట్ల లెక్కింపు పూర్తయిన తదుపరి ఈవీఎంలను సీల్‌చేసే విధానంపై అవగాహన, స్టేట్యూటరీ నివేదిక, రౌండ్ వైస్ నివేదికలు పంపించేందుకు ప్రత్యేక బందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఈనెల 8వ తేదీ లోపు నివేదించాల్సిన ఇండెక్స్ కార్డు రూపొందించే విధానం, మూడు అంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు తదితర అంశాలపై జిల్లాల వారీగా జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు.

ఆదివారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సిఈఓ విసి కలెక్టరు హాజరై మాట్లాడుతూ కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని, భద్రత పరమైన ఏర్పాట్లు ఎస్పీతో సమీక్షించి ఎస్ఓపి మేరకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈవిఎం, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ అన్ని కౌంటింగ్ రోజు జూన్ 4 సాయంత్రం సుమారు 4.10 గంటల కల్లా పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ 3న, అబ్జర్వర్ సమక్షంలో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బందికి రెండు దఫాలు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. తగినంత కేంద్ర బలగాలు రావడం జరిగిందని, స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రం వద్ద, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం ఎంట్రీ, పరిసరాల వద్ద భద్రత ఏర్పాట్లను చేశామని తెలిపారు. ఈసిఐ, సీఈఓ ఏపీ వారి మార్గదర్శకాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సిఈఓకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఈటిబిపీ నోడల్ అధికారిణి సజన, ఎన్నికల సెక్షన్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

టెన్షన్‌లో అభ్యర్థులు

- 4న ఎన్నికల ఫలితాల కోసం నిరీక్షణ
- ప్రధాన పార్టీల గ్రామాల వారీగా లెక్కలు

ప్రజాశక్తి - బాలాయపల్లి

ఎన్నికల పోలింగ్ ముగిన తరువాత అందరి దష్టి కౌంటింగ్‌పైనే.. జూన్ 4 కోసం అభ్యర్థులతోపాటు ఏపీ ప్రజలు నిరీక్షిస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు మాత్రం ఓట్ల లెక్కింపు కోసం ఎదురు చూస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు గ్రామాలవారీగా లెక్కలు తెప్పించుకున్నారు. ఏ గ్రామంలో తమకు అనుకూలంగా ఓట్లుపడ్డాయి.. ఏ గ్రామంలో వ్యతిరేకంగా పడ్డాయో తెలుసుకుంటున్నారు. ఓవైపు వైసీపీ అధినేత జగన్ తమకు మెజార్టీ సీట్లు వస్తాయని 151 నియోజకవర్గాల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. జూన్ 9న జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారంటూ వైసీపీ నేతలు ప్రకటనలు చేస్తున్నారు. అధినేత మాటలకు, మరోవైపు క్షేత్రస్థాయి నుంచి సేకరించిన రిపోర్టుకు పొంతన లేకపోవడంతో వైసీపీ అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారట.

ఉత్తరాంధ్రాలో విజయనగరం మినహా ఉమ్మడి శ్రీకాకుళం, ఉమ్మడి విశాఖలో ఎన్డీయే కూటమి స్వీప్ చేసే అవకాశం ఉందని, ఉభయ గోదావరి జిల్లాల్లోనూ మెజార్టీ సీట్లు కూటమికి వస్తాయని వైసీపీ నేతలే ఓ అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో 151 సీట్లు వస్తాయంటూ జగన్ ఏ ధీమాతో ప్రకటించారో పార్టీ శ్రేణులకు అర్థం కావడంలేదట.

లెక్కలు తారుమారు..


ఎన్నికల పోలింగ్‌కు ముందు ఊహించినదానికి.. పోలింగ్ తర్వాత వినిపిస్తున్న ప్రజల నాడికి తేడా ఉండటంతో వైసీపీ నేతలు టెన్షన్ మొదలైంది. వాస్తవానికి పేద, మధ్య తరగతి మహిళలు, వద్ధుల ఓట్లు ఏకపక్షంగా తమకు పడతాయని వైసీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. అయితే పోలింగ్ సరళి, ఓటింగ్ తర్వాత క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకుంటుంటే మాత్రం మహిళల ఓట్లు మాత్రం ఏకపక్షంగా ఒకే పార్టీకి పడలేదని.. కూటమికి, వైసీపీకి చెరిసమానంగా మహిళల ఓట్లు చీలిపోయినట్లు తెలుస్తోంది. వద్ధుల్లో ఎక్కువశాతం ఓట్లు పడినప్పటికీ.. యువత, ఉద్యోగస్తుల ఓట్లు అధికంగా ఎన్డీయే కూటమికి పడ్డాయని వైసీపీ నుంచి పోటీచేసిన అభ్యర్థులు సేకరించిన సమాచారంలో తేలిందట. దీంతో గెలుపు అవకాశాలు ఎన్డీయే కూటమికే ఉన్నట్లు గ్రామాల్లోనూ ప్రచారం జరుగుతోంది.




అతివిశ్వాసమే దెబ్బతీసిందా..

అతివిశ్వాసమే తమను దెబ్బతీసిందా అనే చర్చ వైసీపీలో జరుగుతోందట. కొన్నిచోట్ల పోల్‌మేనేజ్‌మెంట్ సరిగ్గా చేయకపోవడం తమకు మైనస్‌గా మారిందని కొందరు నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. గెలుస్తామనే ధీమాతో కొన్నిచోట్ల స్థానిక నేతలు డబ్బులు అనుకున్న విధంగా పంచలేదని సొంత పార్టీలోనే చర్చ జరుగుతోంది. దీంతో తమకు గెలుపు అవకాశాలు లేకుండా పోయాయనే చర్చ నడుస్తోంది. అయితే ఏపీ ఫైనల్ తీర్పు ఎలా ఉండబోతుందనేది 4న తేలనుంది.

తాటి ముంజలకు భలే గిరాకీ..!







ప్రజాశక్తి- రామచంద్రపురం:

వేసవిలో వేడి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తాటి ముంజలు చాలా మంచిది. తాటి ముంజల వ్యాపారస్తులు తాటిచెట్ల ఎక్కి తాటికాయలను తీసుకుని వచ్చి ముంజలను వేరుచేసి డిమాండ్‌ను బట్టి డజను రూ.50 నుంచి 70 వరకు అమ్ముతున్నారు. వేసవిలో తాటి ముంజల వ్యాపారం మంచి లాభాలే తెచ్చిపెడుతోంది.

మండలంలోని రామిరెడ్డిపురం, సి రామాపురం. రామచంద్రాపురం, గంగిరెడ్డిపల్లి, గ్రామాల వద్ద రోడ్డు పక్కన తాటి ముంజల వ్యాపారం జోరుగా సాగుతున్నది.

తాటి ముంజలు వేసవి దొరికే ముఖ్యమైన పండ్లలో ఒకటి. ఇవి చూడటానికి జెల్లీలా, పట్టుకుంటే జారిపోయేంత మదువుగా ఉంటాయి. తియ్యగా, నోట్లో వేసుకుంటే కరిగిపోతూ ఉంటాయి. వీటి లోపలి ఉండే నీరు తీయగా చల్లగా చాలా బాగుంటుంది. ఇవి ఎండ వేడి నుంచి శరీరానికి చలువ చేసేలా చేస్తాయి అందుకే వీటి 'ఐస్ యాపిల్' అని కూడా అంటారు.

తాటి ముంజల్లో విటమిన్ బి7, విటమిన్ కె, సోలెబుల్ ఫైబర్, పొటాషియం, క్యాల్షియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ డి, జింక్, ఐరన్‌లతో పాటు అనేక పోషకాలు కలవు..

ముంజలతో ఆరోగ్య ప్రయోజనాలు

ఈ పండులో తక్కువ మొత్తంలో క్యాలరీలు, ఎక్కువ మొత్తంలో శరీరానికి కావాల్సిన శక్తి ఉంటాయి.. కాబట్టి వేసవిలో ఎండ వేడినుంచి శరీరానికి కావల్సిన చల్లదనం కోసం తాటి ముంజల్ని తినడం చాలా అవసరం. ఎండాకాలంలో వేడికి ముఖంపై వచ్చే మొటిమలు నుంచి ఉపశమనం పొందాలంటే కూడా తాటి ముంజల్ని తినాల్సిందే..!

నీటి శాతం ఎక్కువ

తాటి ముంజల్లో నీటిశాతం ఎక్కువ ఉండటం వల్ల వేసవిలో వడదెబ్బ తగలకుండా చేస్తాయి. ఇవి శరీర ఉష్ణోగ్రతను తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తాయి. వీటిల్లో ఉండే అధిక నీటిశాతం శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా చేసి శరీరానికి చలువని అందిస్తాయి. వేసవిలో శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెరలను ఇవి సమతుల్యం చేస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ బి, ఐరన్, క్యాల్షియం శరీరానికి చాలా అవసరం. ఈ పండ్లు ఆకారంలో లీచీ పండును పోలి ఉంటాయి. రుచి లేత కొబ్బరిలా ఉంటుంది.

అదుపులో రక్తపోటు

తాటి ముంజల్లో ఉండే పొటాషియం సమద్ధిగా ఉండడం వలన రక్తపోటు అదుపులో ఉండి గుండె ఆరోగ్యానికి సహాయపడతాయి. అంతేకాకుండా ఇవి శరీరంలోని హానికర వ్యర్థ పదార్థాలను తొలగించడంలో అద్భుతంగా పని చేస్తాయి.

గర్భిణులకూ మంచిదే..

గర్భధారణ సమయంలో కొంతమందికి ఏది తిన్నా జీర్ణం కాకపోవడం లాంటి సమస్య ఎదురవుతాయి. అలాంటి వారు ముంజల్ని తినాలి. ఫలితంగా జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అంతేకాకుండా ఈసమయంలో ఎదురయ్యే మలబద్ధకం, ఎసిడిటీ.. లాంటి ఆరోగ్య సమస్యల్ని కూడా దూరం చేస్తాయి. గర్భిణులకు ఇవి ఎంతో మేలు చేస్తాయి.

బరువునూ తగ్గిస్తాయి

తాటి ముంజల్లో శరీరానికి కావాల్సిన ఎ, బి, సి విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్ఫరస్, పొటాషియం.. వంటివి పుష్కలంగా ఉంటాయి. వీటిలో అధికమొత్తంలో నీరు ఉండటం వల్ల శరీరంలోని అధిక బరువుని తగ్గించేందుకు తాటి ముంజలు ఎంతో సహాయపడతాయి. అంతేకాకుండా తాటి ముంజలు తినడం వలన చెడు కొలస్ట్రాల్ పోయి మంచి కొలస్ట్రాల్ వద్ధి చెందుతుంది. కాలేయ సంబంధ సమస్యల్ని కూడా తగ్గిస్తాయి. పొటాషియం మన శరీరంలో ఉండే విషపదార్థాలను తొలగిస్తుంది. వేసవిలో ఎండ కారణంగా వచ్చే వికారం, వాంతులను నివారిస్తుంది.

చర్మ సంరక్షణ

తాటి ముంజల్ని గుజ్జుగా చేసి ముఖానికి పైపూతలా వేసుకుంటే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఇది చర్మానికి కావల్సినంత తేమను అందించి వేసవి కాలంలో వచ్చే చెమటకాయల్ని నివారిస్తుంది. అలాగే ఎండ వేడిమి వల్ల ముఖంపై ఏర్పడే మచ్చలను తగ్గిస్తుంది. వేసవిలో వచ్చే చికెన్ పాక్స్‌ని నివారించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. మొటిమలను తగ్గించడంలోనూ ముంజలు బాగా పనిచేస్తాయి.

పొట్టు తీయకుండా తినాలి

చాలామంది ముంజలపై ఉన్న పై పొట్టు తీసేసి తింటారు. కానీ ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయి. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవి చాలా అవసరం. అలాగే ఈ పొట్టువల్లే శరీరానికి ఎక్కువ చలువ చేస్తుంది. కాబట్టి తాటి ముంజల్ని పొట్టు తీయకుండా తింటేనే ఆరోగ్యానికి మంచిది.

వాతావరణ మార్పులు..


మానవ తప్పిదాల వల్లే..!

ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక కథనం



ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):

ప్రకృతిలో ప్రతిజీవి సమానమే.. కానీ మనిషి మాత్రం భూమిపై సమాన హక్కులను కలిగి ఉన్న ఇతర జీవులను అంతమొందిస్తూ మనుగడ సాగించడం మూలాన నేడు ఈ భూప్రపంచంపై కొన్ని జీవజాతులు ఆచూకీ లేకుండా పోయింది. ఇది మనమందరం అంగీకరించాల్సిన సత్యం. రోజులు వేగంగా సాగుతున్నా నేడు పర్యావరణ పరిరక్షణపై ఎవరిది భాధ్యత అనే ప్రశ్నను మదిలో తలచుకుంటూ మనిషి జీవనయానం సాగిపోతోంది.



ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడుకోకుంటే రాబోయే రోజులు మనిషి మనుగడ మరింత దుర్భరంగా మారుతుందన్నది నిజం.. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అవసరమైన ప్రకృతి వనరులను అతి వినియోగం కారణంగా రాబోయో రోజుల్లో నీటికి తీవ్రఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు తప్పవని ఇప్పటికే నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు, చట్టాలకు ఎటువంటి ఫలితాలు రావడం లేదని ప్రజలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

మానవ తప్పిదాలే మూలకారణం....

చాలా మంది మనుషులు ప్రకృతిని ఇష్టారాజ్యాంగా దోచుకోవడం వలన వాతావరణంలో అనేక కొత్తకొత్త మార్పులను చూడాల్సివస్తోంది. ఈ మార్పుల ఫలితంగా మనిషి జీవనశైలిలో మార్పులు అనివార్యం అవుతున్నాయి.. వీటి ఫలితం మనిషి తన జీవితకాలాన్ని క్రమేపీ కోల్పోతున్నాడన్నది అక్షర సత్యం. చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటుంన్నాడు. 50ఏళ్ళకు మునుపు మన పూర్వీకులు ఉన్నంత ఆరోగ్యంగా నేడున్న యువకులు ఉండలేకపోతున్నారు. మనిషి జీవితంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్య సమస్య పెనుభూతంగా మారుతున్న తరుణంలో ఆయా వ్యర్థాలు భూమిలో కలసి గాలి, నీరు, నేల కలుషితమై మానవజాతి ఉనికికి ప్రమాదంగా మారిపోతున్నాయి. ప్రస్తుత తరుణంలో ఇకనైనా మనిషి మేల్కోని పర్యావరణానికి హాని తలపెట్టే కార్యక్రమాలను విడిచి పెట్టాల్సి ఉంది.

బతకడం కోసం జీవిస్తున్న వాటినీ..

భూప్రపంచంపై సమానంగా బతకడానికి హక్కులు కలిగిన ఇతర జీవులను మనిషి తన అవసరాలకు ఇష్టానుసారంగా ఇబ్బందులకు గురిచేసి వాటి ఉనికే లేకుండా చేసేంతలా మానవుడు ప్రమాదకరంగా మారిపోయాడు. భూమిపై మనిషి తప్ప ఏ జీవి తాను ప్రపంచంతో పోటీ పడి ఎదగాలని కోరుకోలేదు. స్వేచ్ఛ, సమానత్వం, జీవనం, హక్కుల కోసం చట్టాలు చేసుకున్నది మనిషే... జంతువులు ఎక్కడ కానీ చట్టాలు కోసం ఏకరువు పెట్టిన దాఖలాలు లేవు.. కానీ జంతువులకు మనిషే చట్టాలను చేశాడు. ఆ చట్టాలను అతిక్రమించేది మనిషే... జంతు చట్టాలను అతిక్రమించాడని పట్టుకోనే వారు మనుషులే, న్యాయస్థానాలలో తీర్పు చేప్పేవారు మనుషులే.. శిక్షలు పడితే ఆశిక్షలను అమలు చేసేది మనుషులే. మరి భాదిత జంతువు పాత్ర ఇక్కడ ఎక్కడా మనకు కానరాదు. ఎందుకంటే ఆ జంతువులకు ప్రకృతిలో దొరికే ఆహారాన్ని మాత్రం తినిబతకడం తెలుసు. మనిషి ఇకనైనా పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను తీసుకోవాలి.

అడవులను కాపాడుకోవడమే ప్రథమ కర్తవ్యం..

నేడున్న పరిస్థితుల్లో మార్పు రావడానికి, మానవ జీవనశైలి ఇబ్బందులు లేకుండా సాగడానికి అడవులను పరిరక్షించు కోగలిగితేనే ప్రశాంత వాతావరణం సాధ్యమవుతుంది. ఎక్కా అడవులు పెరగడం లేదు. ఉన్న వాటిని మనిషి తన స్వార్ధపూరిత ఆశలకు బలి చేస్తున్నారు. దట్టమైన అడవులు పలుచగా మారుతున్నాయి.

మన శేషాచల అడవులు వన్యప్రాణుల అభయారణ్యంగా గుర్తించబడింది. మన శేషాచల అడవులు 3వేల చదరపు మైళ్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. శేషాచల అడవుల్లో ఆకురాల్చే భూప్రాంతం అధికం. ఇక్కడ చెట్టు నుండి రాలిన విత్తనాలు మొలకెత్తి దట్టమైన అడవిగా ఏర్పడతాయి. కొందరు అడవుల్లోకి ఎన్‌టిఎఫ్‌పి (నాన్ టింబర్ ఫారెస్ట్ ప్రోడెక్ట్) కోసం వెళ్ళి అడవుల ఎదుగుదలను అడ్డుకుంటున్నారనే చెప్పాలి. నదులకు నీరు అడవుల నుండే పుట్టి ప్రవహించే పరిస్థితి ఉంది. అన్నింటికి మూలమైన అడవులు, పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్యకరమైన జీవనాన్ని మనం గడపగలం.

- ఆర్.యశోదా భాయ్, స్టేట్ సిల్వికల్చరిస్ట్, బయోట్రీమ్, తిరుపతి

హింసాత్మక ఘటనలకు తావు లేదు..



కుప్పం బాదూరులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

- ట్రైనింగ్ ఎస్పి దేవరాజ్ మనీష్ పటేల్

ప్రజాశక్తి-రామచంద్రపురం: కౌంటింగ్ నేపథ్యంలో హింసాత్మక ఘటనలకు తావు ఉండరాదని ట్రైనింగ్ ఎస్పి దేవరాజు మనీష్ పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని కుప్పం బాదూరు, పరమాల గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 144సెక్షన్, 30యాక్ట్ అమల్లో ఉండటం గుర్తు చేశారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో హింసాత్మక ఘటనలకు తావు ఉండరాదని ఎట్టి పరిస్థితుల్లోనూ హింసను ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఓట్ల లెక్కింపు వేళ విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. అలాగే బాణాసంచా విక్రయం, పేల్చడం నిషేధమని తెలిపారు. గ్రామస్తులకు పోలీస్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో రాజకీయాలకు అతీతంగా అందరూ ఐకమత్యంగా ప్రశాంత వాతావరణంలో ఉండాలన్నారు. రామచంద్రాపురం మండలంలో అనుపల్లి, ఎన్ఆర్ కమ్మపల్లి, పరమాల, సి.రామాపురం, రావిళ్ళవారిపల్లి, నడవలూరు గ్రామాలలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో చంద్రగిరి ఇన్‌ఛార్జ్ డిఎస్పి రవికుమార్, ఎస్ఐ చిరంజీవి, కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపీచంద్ సేవలు చిరస్మరణీయం: డ్వామా పీడీ



గోపీచంద్ దంపతులను సన్మానిస్తున్న డ్వామా ఉద్యోగులు

ప్రజాశక్తి-రామచంద్రపురం: ఉపాధి హామీ పథకంలో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్గా బి.గోపీచంద్ జిల్లా ప్రజలకు ఎనలేని సేవలందించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని తిరుపతి జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ కొనియాడారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఉద్యోగ విరమణ మహోత్సవ సన్మాన కార్యక్రమం జరిగింది. విజయవాడలో ఏపీఈడబ్ల్యూ ఐడిసి చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదవి విరమణ పొందడం ఆనందదాయకమని శ్రీనివాసప్రసాద్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా డ్వామా నందు 8 ఏళ్ల ఏపీడిగా పనిచేసి ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించి రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేటట్లు చేయడంలో గోపీచంద్ పాత్ర కీలకమని పలువురు వక్తలు కొనియాడారు. విజయవాడ నాడు-నేడు పథకంలో చీఫ్ ఇంజనీరుగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ప్రభుత్వ విద్యాలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, నగిరి ఏపీడి టిఎన్ శోభన్ బాబు పేర్కొన్నారు. 38 సంవత్సరాలు ప్రభుత్వ శాఖలలో వివిధ హోదాలో మచ్చ లేకుండా సేవలందించిన వ్యక్తి గోపీచంద్ అని సూళ్లూరుపేట ఏపీడి రవికుమార్ అన్నారు. అనంతరం గోపీచంద్ దంపతులను దుశ్శాలువలు, గజ పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆనంద రెడ్డి, డిఈ భాస్కర్, రాష్ట్ర ఉపాధి హామీ మాజీ కౌన్సిల్ సభ్యులు సింగంశెట్టి సుబ్బరామయ్య, ఏపీఓలు జ్యోతి శ్రీ, సంధ్యారాణి డ్వామా సిబ్బంది భాను, రాంబాబు, రాజేష్, గురు, సురేష్ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన సుధీర్ రెడ్డి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును హైదరాబాదులోని ఆయన స్వగృహంలో ఆదివారం శ్రీకాళహస్తి నియోజక వర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు విదేశీ పర్యటన పూర్తి చేసుకుని తిరిగి హైదరాబాద్ వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళని వివరించి గెలుపుపై ధీమాను వ్యక్తపరిచారు. శనివారం విడుదలైన ఎగ్జిట్ పోల్స్‌లో కూటమికి ఏకపక్ష విజయావకాశాలు వెల్లడించడంపై హర్షం వ్యక్తం చేశారు.

చెస్ విజేతలకు బహుమతులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల బాలికల చెస్ పోటీ విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. యూత్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సంస్థ విజేతలకు షీల్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చిల్డ్రన్స్ చెస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ గత 20ఏళ్లుగా చిన్నారుల్లో దాగి ఉన్న మేధోశక్తిని పెంపొందించేందుకు చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన చిన్నారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. గౌరవాధ్యక్షులు శ్యాంబాబు, సెక్రటరీ సురేష్ బాబు, యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ ప్రెసిడెంట్ హేమ కుమార్, ట్రెజరర్ నారాయణ, సభ్యులు శ్రీనివాసులు, సురేష్ బాబు, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు



ప్రజాశక్తి-బాలాయపల్లి: ఎన్నికల నియమాలు ఉలగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ మహబూబ్ సుభాన్ పేర్కొన్నారు. ఆదివారం ఎగ్జిట్ పోల్ వెళ్లడిపై ప్రత్యేకంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాయపల్లి మండలంలో మూడు గ్రూపులుగా ఏర్పాటు చేసి ప్రత్యేకనిగా పెట్టమన్నారు. బాలాయపల్లి బస్టాండు వద్ద ఏఎస్ఐ రామేశ్వర రావు, వెంగమాంబ పురం బస్టాండ్ వద్ద ఏఎస్ఐ మాల్యాద్రి, మొబైల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎగ్జిట్ పోల్ నిబంధనలు తొలగిస్తే కఠినమైన చెరుకు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

చివరి ఓటు వరకు అప్రమత్తంగా ఉండాలి



- కౌంటింగ్ ఏజెంట్‌ల శిక్షణ కార్యక్రమంలో పులివర్తి సుధారెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందంటూ సర్వేలు తేల్చి చెప్పిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనేక అవతతవకలకు పాల్పడే అవకాశం ఉందని చంద్రగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి హెచ్చరించారు. ఆదివారం రేణిగుంటలో కౌంటింగ్ ఏజెంట్‌ల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కౌంటింగ్ ఏజెంట్లు ఏ చిన్న నిర్లక్ష్యానికి గురైనా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి తలెత్తవచ్చని అన్నారు. ఇలాంటి పరిస్థితి రాకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చివరి ఓటును లెక్కించేంత వరకూ ఏ ఒక్కరు కూడా ఓట్ల లెక్కింపు కేంద్రం నుంచి బయటికి రాకూడదని అన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులను ఏర్పడకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు



ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో నెలరోజులపాటు విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ హబ్ వారి సహకారంతో డాక్టర్ ధనంజయులు సారథ్యంలో మే 1 వ తేదీ నుండి నెల రోజులపాటు ఈ వేసవి శిక్షణ తరగతులు జరిపించారు. 9వ తరగతి నుంచి 10వ తరగతి వెళుతున్న విద్యార్థులకు 10వ తరగతిలో పాఠ్య పుస్తకాలలో వచ్చే అంశాలపై ముందుగా 18మంది ఉపాధ్యాయుల చేత శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ పొందిన విద్యార్థులకు పరిసుఖాలు నిర్వహించు ప్రతిభ కనపరిచిన వారికి డాక్టర్ ధనుంజయ చేతులు మీదుగా జ్ఞాపికలను అందజేశారు. అలాగే ఈ శిక్షణ ఇవ్వడంలో ఉత్సాహం కనపరిచిన రిటైయిడ్ షార్ ఉద్యోగి మధు సింగ్‌ను ఘనంగా సన్మానించి, సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జి.జే.రాజశేఖర్, ప్రభాకర్, చెంగయ్య, రవి, రామ్మూర్తి, బాబు, రాజేష్, మస్తాన్, రమణయ్య, జగన్, భాస్కర్, సుజన, అరుణ, ఉషా, సునీల, శైలజ, దివ్య పాల్గొన్నారు.

గుంతల దారి.. మారదా మరి



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని కొత్త వెంకటాపురం పంచాయతీలోని అగ్రహారం నుండి కొత్త వెంకటాపురం ఆదిఆంధ్ర వాడ వరకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి కంకర రాళ్లు తేలి పోయింది. దీంతో ఈ దారిలో ద్విచక్ర వాహనాలు, పాల వ్యాన్‌లు, కార్లతో పాటు చిత్తూరు – కొత్త వెంకటాపురానికి ఆర్‌టిసి బస్సు సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి. అప్పుడప్పుడు టైర్లు పంక్చర్లు కావడం, షేక్ ఆఫ్ స్ప్రింగ్లు, ప్లేట్‌లు విరిగి పోయి వాహనదారులు నానావస్థలు పడుతున్నారు. గుంతల మయంగా ఉన్న రోడ్డులో గత ఐదేళ్లుగా నిత్యం అవస్థలు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నా మని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. సుమారు ఒకటిన్నర కిలోమీటరు మేర రోడ్డు నిత్యం తమిళనాడులో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగే ఈ రోడ్డులో అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇకనైనా ఈ గుంతల రోడ్డును బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు సంబం ధిత అధికారులను కోరుతున్నారు.

ఈ రోడ్డును గుంతల మయం లేకుండా చేయాలని ఐదు ఏళ్లగా పోరాడుతున్నా కుదరలేదు. ఈ ప్రాంత వాహనదారులు తమిళనాడుకు నిత్యం రాకపోకలు సాగించేవారు మండల సరిహద్దులో ఉన్న రోడ్డును బాగు చేయాలని అధికారులకు పలుసార్లు చెప్పినా పట్టించు కోలేదు. రాత్రి పూట వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నాం.



బెల్లంకొండ అశోక్ నాయుడు
మాజీ సర్పంచ్, కొత్త వెంకటాపురం పంచాయతీ.

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సిందే..!



ఈ రోడ్డున వెళ్లాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాలి.. వర్షం పడితే నరకయాతన పడాల్సిందే.. కొన్ని వస్తువులు, సరుకులు తక్కువ ధరలు ఉంటాయి. అవి కొనాలంటే మాకు దగ్గరలో ఉన్న తమిళనాడులోని పొన్నకు వెళ్లి వస్తుంటాం..

- కె. నీరజాక్షుల రెడ్డి, తూగుండ్రం గ్రామం, గంగాధర నెల్లూరు మండలం.

ఆత్మీయ సమావేశం

- పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం




ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని వివేకానంద పాఠశాలలో బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం బలిజ విద్యా దీవెన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ విద్యా దీవెన నిర్వహకులు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యం ఎంచుకొని ఆ లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో ప్రతిభ చాటిన 11మంది విద్యార్థులకు 5వేల చొప్పున నగదును అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘ సభ్యులు రమణయ్య, రాఘవయ్య, సుధాకర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం




ప్రజాశక్తి-వెంకటగిరి: పట్టణంలోని ప్రణతి సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంకటగిరిలో ప్రతిభ చాటి వెంకటగిరి టౌన్ ఫస్ట్‌గా నిలిచి 600/592 మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. విద్యార్థులు నిఖిలేష్, హాసినిలను ఆదివారం సత్కరించి షీల్డ్, పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ప్రణతి సంస్థ గౌరవాధ్యక్షులు బోడి చర్ల సుబ్బయ్య, సరస్వతమ్మ, అధ్యక్షులు సుంకర రవికుమార్, ఉదయగిరి రాఘవేంద్ర, ఎద్దల భాను రేఖ తదితరులు పాల్గొన్నారు.

'రవిరాజు సేవలు అభినందనీయం'



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: డాక్టర్ రవిరాజు సేవలు అభినందనీయం అని విశ్రాంత డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సుభాషిని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిఎంఆర్ కళ్యాణమండపంలో జిల్లా వైద్య శాఖ పనిచేసే పదవి విరమణ చేసిన డాక్టర్ రవి రాజుకి పుత్తూరులో పెద్ద ఎత్తున సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా. వారు మాట్లాడుతూ డాక్టర్ రవి రాజు అందించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చుట్టుపక్కల నుంచి పనిచేసిన డాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, సిద్ధార్థ కళాశాల చైర్మన్ అశోక్ రాజు, హిమజా కళాశాల చైర్మన్ డాక్టర్ రవి రాజు కుటుంబ సభ్యులు, సురేంద్ర రాజు, వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముని కృష్ణయ్య, కార్యదర్శి గోపికృష్ణ, వాకర్ సభ్యులు పట్టణంలో అభిమానులు పాల్గొన్నారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని తయ్యూరు ఆయకట్టు వివిపురం గ్రామ పంచాయతీ అంకన పల్లిలో వెలసిన ద్రౌపదీ దేవి ఆలయ ఆవరణలో ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అలరిం చింది. మహా భారత ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన దుర్యోధన వధ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో దుర్యోధుని ప్రతిమను మట్టితో ఏర్పాటు చేయ గా భీముడిగా సత్తన్న దుర్యోధనుడిగా గోవిందరాజులు వేషధారణ చేసి ప ద్యాలు, పాటలు పాడుతూ జనాన్ని ఆకట్టుకున్నారు. మడుగులో దాగిన దుర్యోధ నుడిని భీముడు లాగి వధించిన ఘట్టం నిర్వహించారు. ధర్మరాజుకి పట్టాభిషేకం మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగారెడ్డి , డిసెంబర్ శెట్టి ,గోపాల్ రెడ్డి, స్థానిక సర్పంచులు రఘునాథ రెడ్డి , వరదమ్మ , దామోదర్ నాయుడు, ధనంజయుల రెడ్డి, వైస్ సర్పంచ్ దామోదర్ ఆచారి, చంద్రా రెడ్డి , రామనాథ రెడ్డి, లోకనాథ్ రెడ్డి అడ్వకేట్ల గురవయ్య, నరసింహులు నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి ఆలయ కుంభాభిషేకం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: కార్వేటి నగరం మండలంలోని సమీపం లోని అమ్మగారితోట ఎస్వీఎస్ నగర్‌లో నూతనం గా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం కుంభాభిషేకం ఘనంగా నిర్వ హించారు. ఈ కుంభాభిషేకాన్ని ఎస్వీ ఎస్ నగర్‌వీధి కుటుంబాల ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు అభిషే కాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామస్తులు స్వామిని దర్శిం చుకున్నారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మినీ ట్రాన్స్ పోర్ట్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం గూడూరు వివేకానంద రోడ్డులోని "మినీ లారీ ట్రాన్స్పోర్ట్" కార్మికులు సీఐటీయూ సభ్యత్వాలు తీసుకొని నాయకుల సమక్షంలో యూనియన్‌లో చేరారు. నూతన కమిటీ ఎన్నికలో భాగంగా అధ్యక్షులుగా ఏ.రాజగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.సుధాకర్, కార్యదర్శి మోడి.ఈశ్వరయ్య, సహాయ కార్యదర్శి ఎన్.మస్తాన్, ట్రెజరర్ డి.వేణు, ఏ.విజయ్ చంద్ర, ఏడు మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, పుట్టా శంకరయ్య, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, బి.చంద్రయ్య పాల్గొన్నారు.



సమస్యాత్మక గ్రామాల్లో ఎస్ఐ సమావేశం



ప్రజాశక్తి-సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి, పేటూరు, ఆవులపల్లి పంచాయతీ ప్రజలతో ఎస్ఐ వెంకట నరసింహులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాల రోజు ఎలాంటి సంబరాలు, ర్యాలీలు, టపాసులు కాల్చడం చేయ కూడదని గొడవలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణ నెలకొల్పే విధంగా ప్రజలు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి




రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అమ్ములు, విశ్వలు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలో ముంగిలిపట్టు కోదండ రామాపురం మధ్యలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం, పేరూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీకి చెందిన విశ్వ(26), అమ్ములు(35)లు ద్విచక్ర వాహనంలో చిత్తూరు నందు తమకు రావలసిన బకాయిలను వసూలు చేయటానికి వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో ముంగిలిపట్టు దాటిన అనంతరం కోదండ రామాపురం సమీపంలో రోడ్డుపైన నిలిపి ఉంచిన వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో ద్విచక్ర వాహనం కిందపడింది. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయాసుపత్రికి తరలించారు. నిలిపి ఉన్న వాహనం డ్రైవర్ పరారిలో ఉన్నాడు. మృతులు ఇద్దరు కూడా తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల హాస్టల్ నందు పనిచేస్తున్నట్లు సమాచారం.

పిడుగు పాటుకు పశువుల మృతి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పిడుగుపాటుకు పశువులు మృతి చెందిన సంఘటన పుత్తూరు రూరల్ మండలంలోని పరమేశ్వర మంగళం పంచాయతీలో ఆదివారం వెలుగుచూసింది. జయరాంపురం గ్రామానికి చెందిన పాడి రైతు శ్యామలకు చెందిన ఐదు పశులను ఇంటి సమీపంలోని చింతచెట్టు వద్ద కట్టేసి ఉంచారు. ఆదివారం ఉదయం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ఉన్న ఐదు ఆవులు మరణించడంతో ఆదరవు కోల్పోయిన మహిళా పాడి రైతు బోరున విలపించింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.